# మందాకిని

## ★ మారేమండ రామారావు ★

ఇంటికి రాగానే బజారునుంచి కొని తెచ్చిన సిరా బుడ్డి తీయడానికి పూనుకున్నాడు కుటుంబరావు. ఓ పట్టాన రాకపోయే సరికల్లా చాపపరిచి, తీరుబడిగా మఠం వేసుక్కూర్చుని ఉపక్రమించాడు.

కుడిచేత్తో మూతా, ఎడమచేత్తో సీసాను పట్టుకొని, బలమంతా వినియోగించి తెరవడానికి ప్రయత్నించాడు. మూత రాలేదు. సీసా తిరగవేసి, తిరగా యత్నించాడు. లాభం లేకపోయింది. ఎడంచేత్తో మూత పట్టుకొని, శరీరంలో బలమంతా వినియోగించి చూశాడు, ఫలం సున్నా. విసుక్కున్నాడు. గోడకు అరచేయి రాసి ప్రయత్నించాడు. జేబు రుమాలతో ప్రయత్నించాడు. జారిపోయింది. కోపం వచ్చింది.

“దుకాణం వెధవ తప్పుమర బిగించాడు. అందుకనే యింత బిగిసిపోయింది” అన్నాడు కనుబొమ్మలు చిట్లించి, మూతి బిగించి మరోసారి ప్రయత్నిస్తూ.

“కంపెనీ నించే ఇలా వస్తుందిగా!” అన్నది ఎదురుగా కుర్రవాడికి పాలు పడుతూ కూర్చున్న జానకి.

ప్రయత్నాన్ని ఉపక్రమిస్తున్న కుటుంబరావు చెయ్యి క్షణంపాటు చలనం మానింది. బిగబట్టిన ఊపిరి మెల్లిగా వదుల్తూ, వంచిన తలనెత్తి జానకి వేపు చురచురా చూశాడు. నుదుటి మీది చెమట బిందువులు కనుబొమ్మల మీదుగా ప్రవహించి, చెంపల ప్రక్కగా దవడల క్రిందుగా అతని తొడ మీద బొట్లుగా పడి పంచెను తడుపుతున్నాయి. ఊపిరి బిగపట్టి వదలడం చేత మొహం ఎర్రబారిపోయింది.

“నీ పని నువ్వు చూసుకో, ప్రతీ దాంట్లోకి నేనున్నానని బయల్దేరతావు” అని హితబోధ చేశాడు.

“సరే, నాకెందుకు లెండి!” అంటూ గ్లాసులో ముంచిన చెంచా కుర్రవాడి నోటివేపు జరిపింది. కాని దాచుకొంటున్న చిరునవ్వుతో కూడిన వారచూపుతో అతని విశ్వయత్నాన్ని చూస్తునే ఉంది. ఆ చూడ్డంలో కుర్రవాడి ముక్కుమీద పోసింది పాలు. వాడు కెవ్వుమన్నాడు. ఉలికిపడి, చీర కొంగుతో తుడిచి మళ్లా పాలు పోయసాగింది. ప్రయత్నంలో మునిగి ఉన్న కుటుంబరావు కోరగా చూసి మూతి బిగించాడు.

ఎంత ప్రయత్నించినా మూత రాలేదు. లేచి పెరట్లోకి దీపం తీసుకెళ్లి సబ్బుతో చేతులు కడుక్కొని వచ్చాడు. తువ్వాలుతో చెయ్యి బాగా తుడుచుకొని మళ్లా కూర్చున్నాడు. రాలేదు. విసుగు పుట్టింది. ముక్కూ, మూతీ తుడుగానున్నాడు. మూతనున్న సిరా చేతినంటి మూతినీ, ముక్కునూ రంగు చేసింది. జానకి నవ్వింది. కుటుంబరావు ఉగ్రుడయాడు.

“నోర్ముయ్” అన్నాడు ప్రయత్నిస్తూనే.

“అరగంట నుంచి చూస్తున్నా. యిలా యివ్వండి. నేను తీస్తా” నంది.

“తియ్యాలి! చెయ్యాలి భోజనం చేసే తియ్యలేక చస్తూంటే యిక నువ్వు తీశావు!” అన్నాడు వెటకారంగా.

“పోనీ, ప్రయత్నిస్తా నివ్వండీ” అంది.

“చాలు చాలు. ఉండు నేనే పట్టుకారుతో తీస్తా” నని పట్టుకారు కోసం ప్రక్కగదిలోకి వెళ్లాడు.

తిరిగి వచ్చే సరికల్లా, జానకి సిరాబుడ్డి తీసింది. మూత తెరవడానికి, కుడిచేత్తో పైటకొంగు తీసి, దాన్ని మూతకు చుట్టి, ఎడం చేత్తో సీసా పట్టుకొని త్రిప్పుతున్నది.

"చాలు చాలు. ఇలాగివ్వు. బద్దలై పోగలదు పడి" అంటూ కుటుంబరావు గదిలోకి వచ్చాడు

జానకి ఒక త్రిప్పులోనే మూత సుళువుగా తీసేసింది. యిలా అనే సరికల్లా మూత ఊడి వచ్చేసింది.

ఆరి, ఆవిరై పోతగాన్న చెమట బిందువుల్లో చాలా, యింకా కుటుంబరావు ముఖం మీదనే ఉన్నాయి ఎర్రబడ్డ ముఖం మామూలు రంగుకు రాలేదు. ప్రయత్నంలో కొంకర పోయిన వ్రేళ్లు తిన్నబడ లేదు. ఓడిపోయిన వాని వేపు జయం పొందిన వాడు చూసినట్లుగా జానకి కుటుంబరావు వేపు చూస్తున్నది.

"చూశారా! అరగంట నుంచి తిన్నూ కదపలేక పోయారు. నేనిట్టే తీసేశాను. పెద్దమాటలాడి, నన్ను వేళాకోళం చేశారు. యిప్పుడేమంటారు?" అన్నది.

ఏం చెప్పాలో తోచలేదు కుటుంబరావుకు. తను ఓడిపోయాడు. నిజమే కాని జానకి ముందు ఓడిపోయినట్టు ఒప్పుకోకూడదు. లోకువై పోతాడు రేపట్నుంచీ. ప్రతి విషయంలో అలుసు చేసేస్తుంది. చెప్పిన మాట వినదు. అందుకని, తను లొంగ కూడదు.

"ఆc, తెలావు! ఊడపొడిచినట్టు! యింతసేపూ నేను త్రిప్పగా, త్రిప్పగా అది వదులైంది. ఎలాగ మరో నిముషంలో వచ్చేసేదే! వదులు చేసిన మూతతీసి, గొప్ప కబుర్లు చెబుతున్నావు,

"అన్నాడు తనల్లిన కల్పన విజయం పొందిందన్న గర్వంలో కుటుంబరావు.

జానకి ఒక చిఱునవ్వు నవ్వింది. తర్వాత ఒక నిముషంపాటు పక పక పెద్దనవ్వు నవ్వింది.

"వదులు చేశారట! వదులు! మీరు ప్రయత్నించి వదులుచేస్తే నేను సుళువుగా తీశానను కుంటున్నారా? మంచి వారే! యిందాకట్నుంచీ మీరు తెరుద్దామని ప్రయత్నించారే, అప్పుడు మూత తియ్యడానికి బదులు బిగిసే వేపు త్రిప్పారు. యింకా బిగిసి, మీకు మూత రాలేదు. నేను రెండో వేపు త్రిప్పగానే వచ్చేసింది. బలేగా చెపుతున్నారే కబుర్లు" అంది నవ్వుతూ జానకి.

ఆ! నిజమే. ఆశ్చర్య పోయాడు. తను వేసిన పాచిక పారలేదు. జ్ఞాపకం తెచ్చుకున్నాడు తను ఇంకా మూత పట్టుకొని బిగించే వైపే త్రిప్పినందుకు తన్ను తాను ఛీడా మడా తిట్టేసుకున్నాడు.

జానకి విరగబడి నవ్వుతూ వంటింట్లోకి వెళ్లిపోయింది. కుటుంబరావు గోడకి జేరబడి నుదిటి మీద చెయ్యి ఆనించాడు. తీసిన సిరాబుడ్డీ మూత వెల్లకిలా పడిఉంది.

★

